క్లుప్తంగా

'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్

కర్నూలు(రూరల్): మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నిర్వహించనున్న యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఆయన బుధవారం కర్నూలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల నోడల్ అధికారులతో మాట్లాడుతూ. అందరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. తహసీల్దారు టి.వి.రమేష్ బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, మండల పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



కబడ్డీ విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎబీఎమ్ చర్చి 18వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం, మంగళవారం ఓపెన్ కబడ్డీ (హోమ్ టీమ్స్) పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలైన జట్లకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి గోనెగండ్లకు చెందిన టీమ్, రెండో బహుమతి ములమాల టీమ్ దక్కించుకున్నాయి. కార్యక్రమంలో 28వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి, నిర్వహకులు నడిపెన్న, కృపానందం, బాబు, ప్రేమరాజు, గోపాల్, సుంకన్న, సత్యం రెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంగా గగ్గటూరు ప్రతిపాదన

పాణ్యం: మండల పరిధిలోని గగ్గటూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసి ప్రతిపాదన పంపినట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు గగ్గటూరు గ్రామ ప్రజలు కొత్తూరు పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసేవారని, అయితే, గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ఎన్నికల కమిషన్ నుంచి ప్రతిపాదన రాగా విచారించి నివేదిక పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం గగ్గటూరులో 414 ఓట్లు ఉన్నాయి.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): తక్షణమే కరెంట్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. బుధవారం 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లు వద్దు.. కరెంట్ బిల్లులు తగ్గించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అధికారంలోకి రాగానే మద్దతు తెలపడం అన్యాయమన్నారు. స్మార్ట్‌మీటర్లతో అధికంగా కరెంట్ బిల్లులు వస్తాయని, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై అదనపు భారం పడుతుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

యువత ఓటరుగా నమోదు కావాలి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య, హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు

కర్నూలు(సెంట్రల్): 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటరుగా నమోదు కావాలని పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌ఓ, జేసీ డాక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు, ట్రాన్స్‌జెండర్లను గుర్తించి ఓటరు నమోదుకు సహకరించాలని కోరారు. ప్రస్తుత లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 1177 డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని, 500 మందిని నూతనంగా ఓటు హక్కు కోసం చేర్పించినట్లు వివరించారు. నియోజకవర్గంలో 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌ను ఫారం-8 ద్వారా చేపట్టనున్నట్లు చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివాహం చేసుకొని వెళ్లిన మహిళలు, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తమ ఓటును అక్కడే బదిలీ చేసుకోవచ్చన్నారు. కాగా, డూప్లికేట్ ఓటర్లను తొలగించాలని, ఇందుకోసం బీఎల్‌ఓలు సక్రమంగా పనిచేసేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు జేసీని కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడు!

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, వితంతువులు
- ఏడాదవుతున్నా మొదలుకాని దరఖాస్తుల స్వీకరణ
- వితంతు పింఛన్ల మంజూరులోనూ మెలిక



గడివేముల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్న దాఖలాల్లేవు. చివరకు ఏ దిక్కూ లేని వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయడం లేదు. దీంతో పలువురు అర్హులు ఇంకెప్పుడు పింఛన్ ఇస్తారంటూ సచివాలయాల చుట్టూ కళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరిలో పింఛన్ల మంజూరు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారు. అలాగే వివిధ సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. గడివేముల మండలంలో ప్రస్తుతం 5,743 మంది సామాజిక పెన్షన్‌దారులున్నారు.

అమలు కాని హామీ

గడివేముల మండలంలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో మొత్తం 16 పంచాయతీలు, 14 సచివాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి సర్కారు హామీ ఇచ్చింది. అయితే, ఇంతవరకు దీనిని ఆచరణలో పెట్టలేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తుందో కూడా ప్రకటించలేదు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మాత్రం కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వస్తున్నారు. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని వారికి సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా పై సమాధానమే వస్తోంది.

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోనే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్ నిలిపివేయడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన వారు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బంది పడుతున్నారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దే పింఛన్ అందించేవారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకునేవారు. అదే విధంగా ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరుకు అవకాశం కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం 50 ఏళ్లు దాటిన వారే అర్జీలు ఇచ్చుకుంటున్నారు.



గడివేముల ఎంపీడీఓ కార్యాలయం

పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి



నా భర్త చాబోలు వెంకటేశ్వర్లు 2024 నవంబర్ 13వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. నేను కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నాకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త చనిపోయి జీవనోపాధి కోల్పోయిన నాకు వితంతు పింఛన్ రావడం లేదు. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేయాలి. – చాబోలు లక్ష్మీదేవి, గడివేముల

దరఖాస్తుకు అవకాశం లేదు



సామాజిక పింఛన్‌దారుడు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. వెబ్‌సైట్ తెరుచుకుంటే అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– వాసుదేవ గుప్త, ఎంపీడీఓ, గడివేముల

నేడు లొద్దిపల్లెలో భజన పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. హనుమజ్జయంతి సందర్భంగా గ్రామంలోని వీరాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో జరిగే పోటీలలో గెలుపొందిన భజన బృందాలకు మొత్తం 8 స్థానాలలకు గాను వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యిల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల భజన బృందాలు అదేరోజు రాత్రి 9 గంటలలోగా రూ.300ల ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849581378, 9502653201 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె, కొమ్మచెరువు, బొడ్డువానిపల్లె, ఓర్వకల్లు, శకునాల, హుసేనాపురం తదితర గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల అభివృద్ధి కమటి సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమంతుని పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే వేడుకల్లో భాగంగా మండలంలోని లొద్దిపల్లె వీరాంజనేయస్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఉపాధి పథకం ఈసీ రంగస్వామి

సి.బెళగల్: మండలంలో పండ్ల తోటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులను ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు గుర్తించాలని ఈసీ రంగస్వామి గౌడ్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి వారు తోటల సాగుకు ముందుకు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా 5 ఎకరాల పొలం కలిగిన మండల రైతులు 18 రకాల పండ్ల తోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పంట పొలాల్లో నీటి కుంటల ఏర్పాటుకు రైతులు, ఇళ్ల ముందు ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రజలు ముందుకు రావాలని, ఈ మేరకు టీఏలు, ఎఫ్ఏలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టీఏలు మురళి, రామ్‌శంకర్, రాజశేఖర్, ఉమ తదితరులు ఉన్నారు.

సంచార చికిత్స కేంద్రం తనిఖీ



సంచార చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): మండలంలోని గార్గేయపురం పీహెచ్‌సీ పరిధిలోని పసుపల గ్రామంలో బుధవారం నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి రఘు తనిఖీ చేశారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. గర్భిణులు రెండు డోసుల టీడీ వ్యాక్సిన్‌తో పాటు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల వరకు చిన్నారులకు వరకు టీకాలు వేయించడం వల్ల పలు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని చెప్పారు. అదే విధంగా ఆయన మాట్లాడుతూ.. రుబెల్ల వ్యాధి రాకుండా 9 – 12 నెలల వయస్సు చిన్నారులకు మెదటి డోస్, 16 – 24 నెలల చిన్నారులకు రెండవ డోస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. పిల్లలకు క్రమం తప్పకుండా వాక్సిన్లు వేయించాలని సూచించారు. వైద్యులు హేమలత, హనుమంతమ్మ, పీహెచ్ఎన్ నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉపాధి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: ఉపాధి సిబ్బంది తమకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కోడుమూరు ఎంపీడీఓ రాముడు సూచించారు. బుధవారం కోడుమూరు ఉపాధి కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, ఏపీఓ మోదీన్ బాషా, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, మేటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్నందున మండలానికి ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన పంట కుంటల నిర్మాణ లక్ష్యాలను సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది 250 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు సగం కూడా పూర్తి చేయలేదని, పండ్ల తోటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలను గుర్తించి వారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించి, పనుల్లోకి వచ్చే కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న డీపీఓ శివారెడ్డి

పాణ్యం: రాబోవు ఐదు సంవత్సరాల్లో నియోజవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని డీపీఓ శివారెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి ప్రణాళికల తయారీపై ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఏఎస్‌ఓలు హాజరైన ఈ సమావేశంలో డీపీఓ మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, శాశ్వత అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై సలహాలు, సూచనలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి తయారీ ప్రణాళికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ప్రవీణ్‌కుమార్, వాసుదేవ గుప్తా, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 28 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్షకు 28 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల అధికారులు తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్లో మూడవ రోజు 70 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 54 మంది హాజరవగా, పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ అధికారి ధనుంజయ గౌడ్ తెలిపారు. అదేవిధంగా సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 86 మంది విద్యార్థులు ఇంగ్లిష్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 74 మంది విద్యార్థులు హాజరవగా 12 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి వెంకటరమణ తెలిపారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠోత్సవం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కలశ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. చివరి రోజు బుధవారం ఆలయంలో కలశాలను ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. మూడవ రోజు కలశాలను గాలిగోపురంలపై ప్రతిష్ఠిచారు. ఎమ్మెల్యే గౌరు చరిత హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీ సర్వే

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో భూ రీ సర్వే పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. బుధవారం గ్రామంలో జరగుతున్న రీ సర్వేను తనిఖీ చేశారు. సర్వే విషయాన్ని సంబంధిత రైతులకు ఒకరోజు ముందుగానే సమాచారం అందించాలన్నారు. రీ సర్వేలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సర్వేయర్లకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మధు, వీఆర్వో సామన్న, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రూసా పనులపై నేడు విచారణ

కర్నూలు (సిటీ): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కాలేజీల్లో రూసా 1.0 కింద రూ.55 కోట్లతో భవనాలను నిర్మించారు. వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో చేపట్టిన భవనాల పనులు దాదాపు పూర్తయ్యాయి. సిల్వర్ జూబ్లీ కాలేజీలోని ఆడిటోరియం మినహా రూసా నిధుల వినియోగం, ప్రస్తుతం ఆ నిధులతో నిర్మించిన భవనాల పురోగతిపై ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఇచ్చిన నివేదిక ఆధారంగా విచారణ చేసేందుకు రూసా రాష్ట్ర డైరెక్టర్ ప్రత్యేక కమిటీని ఇటీవల ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయుడు, ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కిరణ్‌కుమార్, డిగ్రీ కాలేజీల ఆర్‌జేడీ (కడప) నాగలింగారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శశికళ, ఏపీఈడబ్ల్యూఐడీసీ కడప సర్కిల్ ఎస్ఈ ఎస్.శివకుమార్, ఏపీఎంఎస్ఐడీఎస్ ఈఈ ఎ.శ్రీనివాసరెడ్డిని నియమించారు. ఈ కమిటీ నేడు ఆయా కాలేజీల్లోని భవనాలను పరిశీలించనుంది.

కోడుమూరులో భారీ వర్షం

కోడుమూరు రూరల్: కోడుమూరు, గూడూరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెలవారుజాము వరకు పలు విడతలుగా భారీగా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గూడూరులో అత్యధికంగా 49.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, కోడుమూరులో 47.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే భారీ వర్షాలు కురుస్తుతండడంతో కోడుమూరు, గూడూరు మండలాల రైతులు పంటల సాగు కోసం భూములను దుక్కి దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఇలాగే మరిన్ని వానలు పడితే ఖరీఫ్ కింద ముందస్తుగా పత్తి, కంది వంటి పంటల సాగుకు బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కల్లూరులో భారీ వర్షం

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో 38. 66 మీ. మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కురవడంతో మండల వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కల్లూరు అర్బన్ పరిధిలోని రోడ్లు జలమయం అయ్యాయి. కర్నూలు నుంచి కోడుమూరు వెళ్లే రోడ్డుపై పెద్దపాడు వరకు వర్షం నీళ్లు నిలిచాయి. వీకర్‌సెక్షన్ కాలనీ (కోట్ల నగర్), రేడియో స్టేషన్ సమీపంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందైంది. కాగా మంగళవారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు పదును కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోడుమూరు సమీపంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



కర్నూలు నగరం రేడియో స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు



పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

యోగా జీవితంలో భాగం కావాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- వచ్చే నెల 21 వరకు జిల్లాలో యోగాంధ్ర ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు, ప్రజాప్రతినిధులు

కర్నూలు (టౌన్): యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. యోగా శిక్షకులచే యోగాసనాలు అభ్యాసం చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి 69వ సమావేశంలో 2014 సంవత్సరంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపాల్సిందిగా ప్రతిపాదించారని, ఈ ప్రతిపాదనను 177 దేశాలు ఆమోదించడం జరిగిందన్నారు. 2015 నుంచి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. జూన్ 21న విశాఖపట్నంలో 5 లక్షల మందితో నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నారన్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి శిక్షణ, అలాగే 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు మండలస్థాయిలో ప్రజాప్రతినిధులు, ప్రజలతో ఈవెంట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే వచ్చే నెల 2 నుంచి రంగోలి పోటీలు ఉంటాయని జూన్ 18, 19 తేదీల్లో పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో యోగా సంబంధించి పాటల పోటీలు, పెయింటింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఆరోగ్య భారత్ లక్ష్యంతో యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటు చదువు, ఆటల్లో చురుగ్గా ఉంటారన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించారన్నారు. అనంతరం యోగాసనాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలోని టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో యోగా ఉత్సవాలకు సంబంధించిన బెలూన్‌ను ఎగురవేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, డీఎంహెచ్ఓ శాంతికళ, ఆయుష్ శాఖ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలు చేరుకోవాలి

పాణ్యం: ఉపాధి సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ లు, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్ణయించిన పనులను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వరాదన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బస్ షెల్టర్లను బాగుచేయండి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గ్రామాల్లో లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లను బాగు చేయలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో బస్సు షెల్టర్లను శుభ్రంగా ఉంచడంతో ప్రయణికులు కూర్చొని బస్సుల కోసం వేచి చూసేవారు. ప్రస్తుతం వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా మారియి. అలాగే షెల్టర్లు పెచ్చులూడి దెబ్బతినడంతో ప్రయాణికులు నిలువ నీడ లేక ఎండ, వానకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దిగువపాడు గ్రామం కర్నూలు, నంద్యాల జిల్లాకు సరిహద్దు గ్రామం. ఇక్కడి సమీపంలో మిడుతూరు మండల కేంద్రం ఉండటంతో ప్రయణికులు ఎక్కువగా ఉంటారు. గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టరు పెచ్చులూడి కూర్చోవడానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో గ్రామం నుంచి నగరానికి వెళ్లి చదువుకునే పిల్లలు, కాలేజీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గార్గేయపురం బస్ షెల్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉండటం. మరోపక్క గ్రామ సచివాలయం ఉండటం వల్ల మహిళా ఉద్యోగులు ఇక్కడ బస్సుల కోసం వేచి ఉంటారు. బస్ షెల్టర్‌లో కూర్చోవడానికి నాపరాతి బండలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ శిథిలావస్థకు చేరాయి. అలాగే షెల్టర్ వ్యర్థాలతో నిండిపోయింది. వాటిని శుభ్రం చేయకపోవడంతో ఎవరూ వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు నిలువ నీడ లేక, కూర్చోవడానికి చోటు లేక ఇబ్బందులు పాడుతున్నారు. ఎండకు ఎండాల్సిందే, వర్షం వస్తే అటూ ఇటూ పరుగెత్తాల్సిందే. ఇంతగా అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా బస్ షెల్టర్లను బాగు చేయించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులూడిన దిగువపాడు బస్ షెల్టర్



షెల్టర్‌లో కూర్చోవడానికి స్టాల్స్ లేని దృశ్యం



గార్గేయపురం బస్‌షెల్టరు దుస్థితి



షెల్టర్‌లో అపరిశుభ్రత



కోడుమూరు హంద్రీ నదిలోకి విడుదలవుతున్న జీడీపీ నీరు

హంద్రీకి జీడీపీ నీరు విడుదల

సాక్షి ఎఫెక్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరు హంద్రీ నదికి గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. వేసవిలో హంద్రీ నది ఎండిపోవడంతో నదీ పరివాహక ప్రాంతాలైన కోడుమూరు, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల, లద్దగిరి గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో నీటి సమస్య తలెత్తి కాలనీలకు ఐదు రోజులకోసారి మంచినీటిని విడుదల చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలెదుర్కొంటున్న నీటి సమస్యపై ఈనెల 17న 'సాక్షి' దినపత్రికలో 'కోడుమూరులో ప్ర'జల' కష్టాలు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా 40 క్యూసెక్కుల చొప్పున వర్కూరు సుద్దవాగు మీదుగా గత రెండు రోజుల నుంచి కోడుమూరు హంద్రీ నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు.